

'సాక్షి' స్పెల్‌బీకి స్పందన

'సాక్షి' మీడియా గ్రూప్ నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది.

వివరాలు 8లో ▸



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా సాగాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /20.9

వాతావరణం

ఉదయం నుంచి ఎండ ప్రభావం ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చిరుజల్లులు కురవవచ్చు.

న్యూస్‌రీల్

పేదలకు అండగా సర్కార్



వనపర్తిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడే వారు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ దోహదపడుతుందని అన్నారు. కాగా, చెన్నూరు తండాను గ్రామపంచాయతీగా మార్చాలని కోరుతూ తండావాసులు చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, శాంతన్న, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

⇨ పాఠశాల స్థాయి విద్యార్థులు కవిత్వం రూపంలో భావాలు పంచుకునే స్వేచ్ఛ పెంపొందించడం శుభపరిణామమని చిన్నారెడ్డి అన్నారు. పాన్‌గల్ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ పాఠశాల విద్యార్థుల కవిత్వంతో ముద్రించిన ఫ్లయింగ్ బర్డ్స్ పుస్తకాన్ని చిన్నారెడ్డికి అందజేశారు.

బాధితులకు భరోసా కల్పించాలి : ఎస్పీ



వనపర్తి/వనపర్తి రూరల్: వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలని.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని, ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ, క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ కారుతో నిరంతరం గస్తీ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

❐ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ రావుల గిరిధర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం ఐదు అర్జీలు దాఖలు కాగా.. అందులో మూడు భూతగాదాలకు సంబంధించిన అర్జీలు, మరో రెండు పరస్పర ఘర్షణలకు సంబంధించిన అర్జీలు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు.

ప్రజా ఉద్యమాలే సీపీఎం లక్ష్యం

పాన్‌గల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారితో కలిసి ఉద్యమాలు నిర్వహించడమే లక్ష్యంగా సీపీఎం పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. పాన్‌గల్‌లో సోమవారం నిర్వహించిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. దోపిడీ పీడన నుంచి ప్రజల విముక్తి కోసం పార్టీ కార్యకర్తలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో చట్టబద్ధ సంస్థలు నిర్వీర్యమయ్యాయని.. అన్ని వ్యవస్థల్లోకి రాజకీయ జోక్యం పెరగడంతో విజ్ఞాన శాస్త్రం తిరోగమనం దిశగా పయనిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్తమాన ప్రపంచానికి కమ్యూనిస్టు పార్టీల అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదన్నారు. రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి బాల్యానాయక్, వేణుగోపాల్, భగత్, భీమయ్య, వెంకటయ్య, రాము, ఆంజనేయులు, జములయ్య, లలిత, అనిత పాల్గొన్నారు.



అధికారుల బదిలీలపై రాజకీయ దుమారం



బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం

- అవినీతి అధికారులను ప్రోత్సహిస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలు
- కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదుతో బదిలీలు?

వనపర్తి: జిల్లా పౌరసరఫరాల శాఖతో అనుబంధంగా పనిచేసే ఇద్దరు అధికారులు బదిలీ కావడం రాజకీయంగా దుమారం రేపుతోంది. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన విషయంపై రెండు ప్రధాన పార్టీల నేతలు సోషల్ మీడియా వేదికగా చేసుకుంటున్న విమర్శలు హాట్ టాపిక్‌గా మారాయి. సీఎంఆర్, రేషన్ బియ్యం దందాలో జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక పేరుంది. ఈ కారణంగానే జిల్లాలో పని చేసేందుకు అధికారులు సైతం జంకుతారు. ఇటీవల జిల్లా నుంచి బదిలీ అయిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ), సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎంలు లోపాయికారిగా మిల్లర్లకు చేసిన ధాన్యం బదలాయింపు వ్యవహారంలో సుమారు రూ. 16 లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఇతర పనులపై కలెక్టర్‌ను కలిసినప్పుడు పలువురు అధికారులు, సిబ్బంది ఎదుటే ''పౌరసరఫరాల శాఖలో రూ. లక్షలు చేతులు మారుతున్నాయట.. డబ్బులు ఇవ్వందే పనులు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి.. ఒకసారి చూడండి'' అని చెప్పినట్లు తెలిసింది. అయితే ఇతర ప్రాంతాల్లోని తొమ్మిది మిల్లుల నుంచి సుమారు 150 ఏసీకేల ధాన్యం శ్రీరంగాపురం మండలంలోని ఓ రైస్‌మిల్లుకు అనధికారికంగా బదలాయించినట్లు కలెక్టర్‌కు తెలియడంతో సదరు అధికారులు ధాన్యాన్ని వాపస్ తెప్పించే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిసిపోయిందని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకుని వెళ్లే ప్రయత్నం చేసినట్లు అధికార వర్గాల్లో చర్చ సాగింది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ 30న సివిల్ సప్లైశాఖ డీఎం నిజామాబాద్‌కు బదిలీ అయినా.. సోమవారం వరకు రిలీవ్ కాలేదు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మెదక్ బదిలీ అయ్యారు. అయితే సదరు అధికారుల బదిలీ విషయం అధికార, ప్రధాన ప్రతిపక్ష నేతల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. సోషల్ మీడియా వేదికగా ఇరు పార్టీల వారు అడ్డగోలు ఆరోపణలు, హెచ్చరికలు చేసుకుంటున్నారు. సివిల్ సప్లై అధికారిని ఎమ్మెల్యేనే కోరితెచ్చుకున్నారని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తుండగా.. అవినీతి అధికారులను తమరే ప్రోత్సహించారని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎలాంటి రాజకీయ జోక్యం లేదు..

అధికారుల బదిలీల్లో గాని, తాత్కాలికంగా (రెండు నెలలు) పాత డీఎంనే జిల్లాలో కొనసాగించాలనే అంశంపై గాని ఎలాంటి రాజకీయ జోక్యం లేదు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన దృష్ట్యా అధికారి మారితే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో ఈ బదిలీలను రెండు నెలలపాటు నిలిపివేయాలని ఉన్నతాధికారులను అభ్యర్థించడం వల్ల ఎక్కడి వారు అక్కడే పనిచేయనున్నారు.

– జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్

వెనుతిరిగిన బదిలీపై వచ్చిన అధికారి..

అక్టోబర్ 30న సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండీ కార్యాలయం నుంచి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిజామాబాద్ నుంచి వనపర్తికి బదిలీ అయిన వైపీ రమేష్ సోమవారం విధుల్లో చేరేందుకు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలతో ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఇటీవల ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని.. బదిలీపై వచ్చిన అధికారికి అనుభవం తక్కువగా ఉందని జిల్లా అధికారులు సివిల్ సప్లైశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి బదిలీ ఉత్తర్వులను తాత్కాలింగా నిలిపేలా ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చేందుకు వచ్చిన అధికారి నిరాశతో వెనుదిరిగినట్లు కలెక్టరేట్‌లోని పలు శాఖల అధికారులు చర్చించుకోవడం కనిపించింది. ఈ వ్యవహారంలో రాజకీయ జోక్యం ఉందా అనే విషయంపై అధికారులు ఎవరూ స్పష్టతనివ్వడం లేదు. కాగా, అధికార పార్టీలోని రెండు వర్గాల మధ్య ఉన్న విభేదాలతోనే డీఎంల బదిలీకి బ్రేక్ పడినట్లు ప్రచారంలో లేకపోలేదు.

అనధికారిక ధాన్యం బదలాయింపుపై విచారణ ఏది?

కొందరు మిల్లర్లతో చేతులు కలిపిన సివిల్ సప్లైశాఖ అధికారులు 150 ఏసీకేల ధాన్యాన్ని ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఓ మిల్లుకు బదలాయించడం.. అందుకు గాను పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు వెల్లువెత్తుతున్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టకపోవడమేమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సీఎంఆర్ ఇవ్వని 70 శాతం మిల్లర్లు డిఫాల్టర్ జాబితాలో ఉన్నారు. ఈ విషయంపై ప్రతినెలా రెండు, అంతకంటే ఎక్కువసార్లు సమీక్షలు నిర్వహించే ఉన్నతాధికారులకు ఈ విషయంపై దృష్టి పెట్టకపోవడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.





శేష వాహనంపై కురుమూర్తిరాయుడు

శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి కురుమూర్తి స్వామివారు పద్మావతి సమేతంగా శేష వాహనంపై ఊరేగారు. మంగళవాయిద్యాల మధ్య పల్లకిసేవ కొనసాగింది. ప్రధాన ఆలయం నుంచి మోకాళ్ల గుండు వరకు స్వామివారు విహరించారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఏడుకొండలు మారుమోగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు కమలాకర్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

– చిన్నచింతకుంట

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

- జిల్లావ్యాప్తంగా 379 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- అవసరమైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



కొత్తకోట మండలం కానాయపల్లిలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి/కొత్తకోట రూరల్/మదనాపురం: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరిధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ధాన్యం కొనుగోలు అంశంపై ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రత్యేకాధికారి రవి నాయక్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తేమశాతం, సన్నరకాలను గుర్తింపు పక్కాగా ఉండాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేశాక వివరాల నమోదు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 379 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నామని.. అందులో 262 కేంద్రాలను సన్నాల కోసం కేటాయించినట్లు వివరించారు. మొత్తం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 కేంద్రాలను ప్రారంభించి, 1,500 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చేసినట్లు చెప్పారు. రాబోయే రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా మదనాపురం, కొత్తకోట మండలం కానాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి..

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కొత్తకోట మున్సిపల్ కార్యాలయం, మదనాపురం రైతువేదికలో ఎన్యుమరేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేలో వివరాల సేకరణపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. తమ ఎన్యుమరేషన్ బ్లాక్ ఎక్కడుందో తెలుసుకొని 6వ తేదీ నుంచి కుటుంబాల జాబితా తయారు చేసుకోవాలని సూచించారు. 9వ తేదీ నుంచి ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించాలని సూచించారు. సర్వేలోని ప్రశ్నావళిలో స్టార్ గుర్తు ఉన్న ప్రతి ప్రశ్నకు సమాధానం కోడ్ రూపంలో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అందువల్ల పుస్తకంలో ఇచ్చిన అన్ని కోడ్‌లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సర్వే నివేదికను ఏ రోజుకారోజు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించాలని.. అదే రోజు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, డీఏఓ గోవిందు నాయక్, డీఆర్డీఓ ఉమాదేవి, డీసీఓ ప్రసాదరావు, డీఎస్ఓ కాశీ విశ్వనాథ్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, మదనాపూర్ మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున్, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ ప్రసన్న కుమారి ఉన్నారు.

❐ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దాఖలు చేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 40 అర్జీలు దాఖలైనట్లు గ్రీవెన్స్‌సెల్ అధికారి శ్రీకాంత్‌రావు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని

వనపర్తిటౌన్: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మైనర్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. 18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని హెచ్చరించారు. బడిఈడు పిల్లలతో పనులు చేయించుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, నరేందర్‌బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య పాల్గొన్నారు.

భూ సేకరణే అడ్డంకి

- ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల అసంపూర్తి పనులపై దృష్టి
- తాజాగా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- భీమా, కల్వకుర్తి, పాలమూరు ఎత్తిపోతలపై నిరంతర సమీక్ష
- వచ్చే ఏడాది పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా అడుగులు

ఏళ్ల తరబడిగా సా..గదీతకు ఇదే ప్రధాన కారణం



కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదటి లిఫ్టు (ఫైల్)

గద్వాల: ఉమ్మడి పాలమూరు జిల్లాలో జలయజ్ఞంలో ప్రాజెక్టులు గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయి. దీంతో వలసల జిల్లాను సస్యశ్యామలం చేయాలనే ఆశయానికి అడ్డంకిగా మారింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసి.. ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేస్తాం.. ప్రాజెక్టులకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలోనే ఏళ్ల తరబడిగా సాగుతున్న ఆయా ప్రాజెక్టుల పూర్తికి అవసమైన చర్యలు చేపడుతున్నారు. అసంపూర్తి పనులకు ప్రధాన సమస్యగా మారిన భూసేకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో బీడు భూములకు సాగు నీటిని పారించి వలసల జిల్లా వరస మార్చాలనే అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన దిశగా అడుగులు పడుతున్నాయి. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. ప్రస్తుతం 6 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది.

నిరసనల నేపథ్యంలో..

సెప్టెంబర్ నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులకు పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని జడ్చర్ల వద్ద భూ నిర్వాసితుల నుంచి పెద్దఎత్తున నిరసన సెగ తగిలాయి. దీంతో అసంపూర్తి పనులు పూర్తి చేయాలంటే భూ సేకరణ సమస్యను పరిష్కరించాలని గ్రహించిన ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారు. భూ సేకరణ ప్రక్రియను ఆయా జిల్లాల కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షిస్తూ పరిష్కారం చూపాలని ఆదేశించారు. దీంతో భూ సేకరణ ప్రక్రియను కలెక్టర్లే పర్యవేక్షిస్తున్నారు.

నిర్వహణ లోపమే శాపం

మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలో రెండు పంటలకు 50 వేల ఎకరాల సాగునీరు అందించే లక్ష్యంతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం చేపట్టారు. అయితే నిర్మాణం మొదలైనప్పటి నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు సమస్యలే ఎదురవుతున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తిచేయడంలో విఫలమవడంతో ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పైగా జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వస్తున్న క్రమంలో మోటారు పంపులలో సాంకేతిక సమస్యలు తలెత్తడం తరచుగా జరుగుతుంది. ఇక్కడ కూడా నిర్వహణ లోపమే శాపమైంది.

భీమాది అదే దారి..

నారాయణపేట జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన భీమా ఎత్తిపోతల పథకం పనులు సైతం అసంపూర్తిగా ఉండటంతో దాని కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించలేని పరిస్థితి.

ర్యాలంపాడుకు మరమ్మతులు..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు జలాశయం ఈ ప్రాజెక్టుకు గుండెకాయవంటిది. అయితే రాక్ టోల్, తూములు, ఆనకట్ట బండ్‌లో లీకేజీ ఏర్పడటంతో మూడేళ్లుగా 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తూ వస్తున్నారు. దీంతో ఈ జలాశయం కింద ఒక పంట అంటే ఖరీఫ్‌లో మాత్రమే సాగునీరు అందిస్తున్నారు.

నెట్టెంపాడు.. 90 శాతం పూర్తి

సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం 99వ ప్యాకేజీలో సుమారు 420 ఎకరాలకు సంబంధించి భూసేకరణ సమస్య అడ్డంకిగా మారింది. దీనిని జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ స్వయంగా పర్యవేక్షిస్తూ భూసేకరణ ప్రక్రియలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. పదేళ్ల కిందటే ప్రాజెక్టు కింద 90 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ, పదేళ్లుగా మిగిలిపోయిన పనులను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఈ దుస్థితి నెలకొంది. అయితే పదేళ్ల కిందట ఈ ప్రాజెక్టులోని గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు జలాశయాల కింద 1.45 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. వినియోగంలోకి వచ్చిన పంపుల నిర్వహణ సైతం పట్టించుకోకపోవడంతో మోటార్లలో సాంకేతిక సమస్య తలెత్తి మొరాయించడంతో నీటి పంపింగ్‌కు ఆటంకాలు తలెత్తడం పరిపాటిగా మారింది.



నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు గుడ్డెందొడ్డి మొదటి లిఫ్టు

కేఎల్‌ఐ ఇలా..

నాగర్‌కర్నూల్ జిల్లాలో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం మొత్తం 5 పంపులు ఏర్పాటు చేయగా.. వివిధ రకాల కారణాలతో కేవలం రెండు పంపులు మాత్రమే పని చేస్తుండగా.. మిగిలిన మూడు పంపులు మరమ్మతుకు గురై మూడేళ్లుగా మూలనపడ్డాయి. దీంతో రెండు పంపుల ద్వారానే 2.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేస్తే మిగిలిపోయిన 2 లక్షల ఎకరాల ఆయకట్టు కూడా సాగులోకి వస్తుంది.

వేగవంతం చేశాం..

అసంపూర్తి పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సమీక్షలు కొనసాగుతున్నాయి. అలాగే భూ సేకరణకు అవసరమైన నిధుల కేటాయింపు, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేశాం. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి అసంపూర్తి పనులు పూర్తి చేసి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం.

– శ్రీధర్, ఎస్‌ఈ, గద్వాల జిల్లా సాగునీటి ప్రాజెక్టులు

సివిల్, మెకానికల్ పనులు

పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు సైతం వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. సివిల్, మెకానికల్ పనులు చేయాల్సి ఉంది. అలాగే పలు రిజర్వాయర్ల కింద భూ సేకరణ చేపట్టాలి. ఉదండాపురంలో మంత్రులకు నిర్వాసితుల నుంచి నిరసనలు ఎదురయ్యాయి.

క్లుప్తంగా

పాము కాటుతో జీపీ కార్మికుడు మృతి


కొండ బాలయ్య (ఫైల్)

ఖిల్లాఘనపురం: పాముకాటు వల్ల గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఖిల్లాఘనపురం మండల పరిధిలోని వెంకటాంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వెంకటాంపల్లికి చెందిన కొండ బాలయ్య(34) గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. మధ్యరాత్రి రెండు గంటల సమయంలో కడుపులో నొప్పి రావడంతో నిద్రలేచి చూశాడు. ఇంటి కడప దగ్గర పాము కనిపించింది. భార్యను నిద్రలేపి పామును చంపారు. పాముకరిచిందని అనుమానంతో మండల కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. అతని భార్య కొండ కురుమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు.

నీటికుంటలో పడి వృద్ధుడు..


లక్ష్మయ్య(ఫైల్)

అమ్రాబాద్: నీటి కుంటలోపడి వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్(బీకే)లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శాల్కి లక్ష్మయ్య(62) శనివారం మధ్యాహ్నం తమ వ్యవసాయ పొలం పక్కనే ఉన్న నీటికుంటలో స్నానం చేసేందుకు వెళ్లాడు. పంచ కట్టుకోని ఉండటంతో లోతు నీటిలోకి వెళ్లాక పంచ కాళ్లకు బంధంగా పడి ఈదలేక మునిగి పోయాడు. కొద్ది దూరంలో ఉండి గమనించిన కోడలు భర్తకు చెప్పి ఇద్దరు కలిసి నీటికుంట వద్దకు వచ్చారు. అప్పటికే లక్ష్మయ్య మునిగి పోయాడు. స్థానికుల సహకారంతో లక్ష్మయ్యను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కుమారుడు కరుణాకర్, భార్య రాములమ్మల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అమ్రాబాద్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అతనికి భార్య రాములమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ, మండల కాంగ్రెస్ నాయకులు హరినారాయణగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చికిత్స పొందుతూ మహిళ..

జడ్చర్ల: కస్తూర్బా విద్యాలయంలో చదువుతున్న తమ కూతురిని చూసి తిరిగి ఇంటికి వెళ్తున్న తల్లి రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు లలిత(30) ఆదివారం తన భర్త మల్లేష్‌తో కలిసి మోటార్‌బైక్‌పై జడ్చర్ల డీటీసీ సమీపంలో ఉన్న కేజీబీవీ విద్యాలయంలో చదువుతున్న తమ కూతురును చూసి తిరిగి ఇంటికి వెళ్తుండగా మాచారం దగ్గర బ్రిడ్జిపై ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై సోమవారం భర్త మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


మహబూబ్‌నగర్ మౌంట్‌బాసిల్ స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు


కొల్లాపూర్ ఎల్లూరు అక్షర స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన

పెద్ద సంఖ్యలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/కొల్లాపూర్: పాఠశాల స్థాయి విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించి, అభ్యసన సామర్థ్యం పెంపొందించేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అపెక్స్ స్కూల్, మౌంట్ బాసిల్ పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పరీక్ష రాశారు. ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జరిగిన పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరీక్షలో వచ్చిన ప్రశ్నలకు విద్యార్థులు ఎంతో సులభంగా సమాధానాలు రాశారని.. మెటీరియల్ చదవడంతోనే ఇది సాధ్యమైందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్పెల్ బీ పరీక్షతో విద్యార్థులకు గ్రామర్, స్పెల్లింగ్‌తో పాటు అనేక అంశాలపై అవగాహన వస్తుందన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఇలాంటి పోటీ పరీక్షలతో భవిష్యత్‌లో మరింత సామర్థ్యంతో రాణించగలరని అభిప్రాయం వ్యక్తంచేశారు.

ప్రతిభ వెలికితీసేందుకే దోహదం..

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని అక్షర స్కూల్ కరస్పాండెంట్ నరేష్‌కుమార్, ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్‌లు అన్నారు. కొల్లాపూర్ మండలం ఎల్లూరులోని అక్షర స్కూల్‌లో 'సాక్షి' ఆధ్వర్యంలో స్పెల్ బీ పరీక్ష నిర్వహించగా.. వివిధ కేటగిరీల్లో 19 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. ఇంగ్లిష్, మ్యాథ్స్ విభాగాల్లో జరిగే స్పెల్ బీ పరీక్షలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందిస్తాయని అన్నారు.

అనేక అంశాలను నేర్చుకుంటున్నాం..



కొన్ని సంవత్సరాలుగా 'సాక్షి' స్పెల్ బీ పరీక్ష రాస్తున్నాం. పరీక్షకు సంబంధించిన మెటీరియల్ ద్వారా ఇంగ్లిష్ ప్రొనౌన్సియేషన్, లిటరేచర్ స్కిల్ వంటి వాటికి ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష రాసిన ప్రతి సారి చాలా అంశాలను నేర్చుకుంటున్నాం. పరీక్ష రాయడం ద్వారా కాంపిటిటీవ్ స్కిల్ కూడా పెరుగుతుందని భావిస్తున్నాం. – శ్రీ చైత్రిక, 8వ తరగతి, మౌంట్‌బాసిల్ స్కూల్

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు ఇంగ్లిష్ స్పెల్లిగ్, గ్రామర్ వంటి అంశాలను నేర్చుకుంటారు. ముఖ్యంగా పరీక్షల్లో పోటీపడి సులభంగా మార్కులు సాధించే తత్వం పెరుగుతుంది. విద్యార్థులు భవిష్యత్‌లో సులువుగా పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం ఉంటుంది. – సోమశేఖర్, ప్రిన్సిపాల్, మౌంట్‌బాసిల్ స్కూల్

సులువుగా పరీక్ష రాశా..



స్పెల్ బీ పరీక్ష రాసే క్రమంలో ప్రశ్నలు సులువుగా అర్థమయ్యే విధంగా ఉండటంతో జవాబులు కూడా సులభంగా రాశాను. ఈ పరీక్షతో ఎటువంటి పరీక్షను అయినా సులువుగా రాయగలనని అనిపించింది. స్పెల్‌బీ పరీక్ష ఎప్పుడు నిర్వహించినా నేను రాస్తాను. తద్వారా ఇంగ్లిష్ నేర్చుకునేందుకు దోహదపడుతుంది. – రాంచరణ్, 9వ తరగతి, అపెక్స్ స్కూల్

గ్రామర్‌పై పట్టుకోసం..



స్పెల్ బీ పరీక్షను గతంలో కూడా రాశాను. దీన్ని వల్ల ఇంగ్లిష్ గ్రామర్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించగలను అనే నమ్మకం వచ్చింది. పరీక్షలో ప్రశ్నలు చూస్తే, సులువుగా సమాధానాలు రాయగలమనే నమ్మకం వస్తుంది. పాఠశాల స్థాయిలోనే పోటీ పరీక్ష రాశామన్న సంతోషం ఉంది. మంచి మార్కులు సాధిస్తా. – కావ్యశ్రీ, 8వ తరగతి, అపెక్స్ స్కూల్

మంచి అనుభవం ఇచ్చింది..



'సాక్షి' స్పెల్ బీ పరీక్ష ఒక మంచి అనుభవాన్ని ఇచ్చింది. గ్రామర్, స్పెల్లింగ్ వంటి వాటికి సంబంధించి పరీక్ష ఎలా రాయాలో అనే విషయం తెలిసి వచ్చింది. పరీక్షలో తప్పులు దొర్లకుండా నేరుగా సమాధానం రాసే విధంగా ప్రశ్నలు ఉన్నాయి. పరీక్ష బాగా రాశాను. ఎప్పుడు పరీక్ష నిర్వహించినా రాస్తాను. – విహాన్, 6వ తరగతి, మౌంట్‌బాసిల్ స్కూల్

వనపర్తిలో సినీనటి అనసూయ సందడి

వనపర్తి: జిల్లాకేంద్రంలో కాసం ఫ్యాషన్స్ రెడీమేడ్ క్లాత్ షోరూంను ప్రముఖ సినీనటి అనసూయ భరద్వాజ్ షోరూం డైరెక్టర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షోరూంల మాదిరిగా వనపర్తిలో 15వ బ్రాంచ్‌ను అధికారికంగా లాంచ్ చేసినట్లు ఆమె వెల్లడించారు. కాసం ఫ్యాషన్స్‌లో నూతన కలెక్షన్లు, పిల్లలు, పెద్దలు, మహిళలకు కావాల్సిన అన్ని రకాల దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత నాలుగేళ్లగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల్లో 15 స్టోర్స్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. నూతన ఫ్యాషన్ డిజైన్లను వినియోగదారులకు తక్కువ ధరకు అందిస్తున్నామన్నారు. సినీనటి అనసూయను చూసేందుకు ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆటపాటలతో ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రజలను అనసూయ అలరించారు.


షాపింగ్ మాల్ డైరెక్టర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి అనసూయ

బాపు బాటలో పయనించాలి

రిటైర్డ్ డీఈఓ డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్

గండీడ్: విద్యార్థులు బాపు చూపిన బాటలో పయనించాలని రిటైర్డ్ డీఈఓ డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఆయన బాపు బాటలో సత్యశోధన పాదయాత్ర చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 100 రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా 34 గండీడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్, గండీడ్ బాలుర ఉన్నత పాఠశాలల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకొని బాపు ఎలాగైతే స్వాతంత్య్రం సాధించాడో మీరు కూడా అదే రీతిలో విజయం సాధించాలన్నారు. ఎప్పుడూ సత్యాన్నే పలకాలని ఆయన విద్యార్థులకు హితవు పలికారు. చక్కటి క్రమశిక్షణతో సన్మార్గంలో పయనించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వెన్నాచేడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.మల్లికార్జున్, ఆర్.జనార్దన్, ఉపాధ్యాయులు రమేష్, జనార్దన్, కృష్ణారెడ్డి, హన్మంతు, ముకుందరెడ్డి పాల్గొన్నారు.


వెన్నాచేడ్ బాలుర పాఠశాలలో మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈఓ డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో వానాకాలం సీజన్ వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ నుంచి నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, మహబూబ్‌నగర్ కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖలు, డీఆర్‌డీఓ, ఆర్డీఓలతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు మొదలై ధాన్యం వస్తున్నందున అన్ని కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా చేపట్టాలని, ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాల గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందని, ఈ క్రమంలో దొడ్డు, సన్న రకం ధాన్యం జాగ్రత్తగా సేకరించాలని సూచించారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రవాణా చేయాలని, రైస్‌మిల్లర్లు, రైతులకు ఇబ్బంది కలగకుండా వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని, ట్రక్‌షీట్ అందజేయాలన్నారు. ప్రభుత్వం మిల్లర్ల సంక్షేమం దృష్ట్యా మిల్లింగ్ చార్జీలను సన్నరకం 40 శాతం, దొడ్డు రకం 30 శాతం పెంచిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నమోదు చేయాలన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ జిల్లాలో కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి వెంకటేష్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం విక్రమ్, సహకార అధికారి శంకరాచారి, ఆడిట్ అధికారి టైటస్‌పాల్, డీఆర్‌డీఓ నర్సింహులు పాల్గొన్నారు.

జూరాలకు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు మరింత తగ్గింది. సోమవారం సాయంత్రం 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 8,138 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 72 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 9,780 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.645 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 879.8 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 879.8 అడుగుల వద్ద 186.8502 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 13,490 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. శ్రీశైలంలో ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,080 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 15,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,604, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భకేంద్రంలో 7.481 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులకు 7 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి సోమవారం 7,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. రెండు గేట్లను తెరిచి 5,352 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన పెబ్బేరు పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. పెబ్బేరుకు చెందిన మెడమోని రాజు (46)పట్టణ సమీపంలోని మహభూపాల్ సముద్రం చెరువులో ఎవరూ చేపలు పట్టకుండా కాపరిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం చెరువు వద్ద కాపలా కాసేందుకు వెళ్లిన అతడు సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి చిన్న కుమారుడు అంజి చెరువు వద్దకు వెళ్లి చూడగా.. కట్టపై తండ్రి బట్టలు కనిపించాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి చేరుకొని గాలించడంతో చెరువులో అతడి మృతదేహం లభ్యమైంది. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య గోవిందమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్థాపంతో రైతు బలవన్మరణం

ఖిల్లాఘనపురం: పొలానికి వెళ్లే దారి విషయంలో మనస్థాపానికి గురైన ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉప్పరిపల్లికి చెందిన మండడి వర్ధారెడ్డి (55) వ్యవసాయ పొలంవైపు వెళ్లే దారి ఆ ప్రాంతంలోని సుమారు 10 మందికి ఉపయోగపడుతుంది. అయితే ఆ దారి పాడైపోవడంతో రైతులందరూ కొంత డబ్బు పోగు చేసుకుని మరమ్మతు చేయించారు. వర్ధారెడ్డిని సైతం వారు డబ్బులు అడుగగా.. తాను గతంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మట్టి వేయించానని, ఇప్పుడు డబ్బులు ఇవ్వనని స్పష్టం చేశారు. అయినప్పటికీ డబ్బులు ఇవ్వాలని సదరు రైతులు చెప్పడంతో మనస్థాపానికి గురైన అతడు.. వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై ఎస్‌ఐ సురేష్ గౌడ్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. మృతుడికి భార్య మండడి వరలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు


నిజామాబాద్- రంగారెడ్డి బాలికల జట్ల మధ్య కబడ్డీ పోటీ

అడ్డాకుల: మండలంలోని రాచాలలో రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా సాగాయి. ఎస్‌జీఎఫ్ అండర్- 17 బాలికలు, అండర్-19 బాలుర విభాగంలో రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 240 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటుండగా.. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచులను కొనసాగిస్తున్నారు. ఎంఈఓ కురుమూర్తి, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతయ్య యాదవ్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను కొనసాగించారు. క్రీడాకారులకు స్నేహ ఫౌండేషన్ ద్వారా భోజన వసతి కల్పించారు. మంగళవారం సాయంత్రం పోటీలు ముగియనున్నాయి. పోటీల అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. బాలికల రాష్ట్ర జట్టు మధ్యప్రదేశ్‌లో, బాలుర రాష్ట్ర జట్టు హరియాణాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాయి. చివరి రోజు పోటీలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కురుమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జీహెచ్‌ఎం ఫయాజొద్దీన్, పీడీలు వడెన్న, జగన్‌మోహన్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్- నల్లగొండ బాలుర జట్ల మధ్య కబడ్డీ పోటీ

ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు


ఎంపికల్లో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలోగల ఇండోర్ స్టేడియంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల ఉమ్మడి జిల్లా యోగా బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఈ మూడు విభాగాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 మంది హాజరయ్యారు. వీరికి గ్రూప్‌ల వారీగా యోగా ఆసనాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, పీడీలు వేణుగోపాల్, ఆర్.బాల్‌రాజు, చంద్రశేఖర్, సూర్యప్రకాశ్‌రావు, నర్సింహులు, జ్యోతి, సుగుణ పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా మణికంఠ, సాగర్, బాలమణి వ్యవహరించారు.

అండర్-23 టోర్నీలో పాలమూరు ఓటమి

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్ పట్టణంలో సోమవారం నుంచి ప్రారంభమైన హెచ్‌సీఏ అండర్-23 టోర్నీలో ఉమ్మడి పాలమూరు జట్టు తొలి మ్యాచ్‌లోనే ఓటమి చవిచూసింది. ఆదిలాబాద్ జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 47.1 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో డేవిడ్ క్రిపాల్ 54 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆదిలాబాద్ జట్టు 39.2 ఓవర్లలో 7 వికెట్లకు 192 పరుగులు చేసింది.

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి


హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి టోర్నీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి చాంపియన్‌గా నిలవాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను శారదాబాయి ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, పీడీలు వేణుగోపాల్, నిరంజన్‌రావుతోపాటు సంఘం ప్రతినిధులు రజనికాంత్‌రెడ్డి, జియావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే స్టేడియంలో అండర్-19 విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహించారు.

రన్నరప్‌గా మహబూబ్‌నగర్



కుమురంభీం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో మూడురోజులుగా నిర్వహిస్తున్న 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ 23-17 తేడాతో విజయం సాధించింది. – ఆసిఫాబాద్ రూరల్